క్లుప్తంగా

దొంగలతో బెంబేలు



చిన్నంబావి: మండలంలోని పలు గ్రామాల్లో వరుస దొంగతనాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుంది. నెల రోజుల నుంచి మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో దొంగలు విలువైన సామాగ్రిని చోరీ చేశారు. తాజాగా మండలంలోని గూడెం గ్రామంలో రామాలయ ఆలయంలో బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అదేవిధంగా గడచిన నెల రోజులుగా దగడపల్లిలోని రామాలయంలో వెండి కీరిటాలను, బెక్కెం గ్రామంలో తిరుమలనాథస్వామి ఆలయంలో హుండీని పగలగొట్టి చోరీ చేశారు. దీంతో పోలీసులకు దొంగలను పట్టుకోవడం సవాల్ గా మారింది. ఈ దొంగతనాలకు ఎప్పుడు చెక్ పడుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

టీఎస్‌యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



వనపర్తి టౌన్: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ బుధవారం రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) డైరీని కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని వారిని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ రవిప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కోశాధికారి హమీద్, ఉపాధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శులు బి.వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, వెంకటేష్, నరేందర్, సూరయ్య, కృష్ణ, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: వ్యక్తికి గాయాలు

పెబ్బేరు రూరల్: ఆటో అదుపుతప్పి బోల్తాపడి ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని చిట్యాల శివారులో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వనపర్తి మండలంలోని తూర్పు తండాకు చెందిన నాను వనపర్తి నుంచి తండాకు ఆటోలో వెళ్తున్న క్రమంలో చిట్యాల శివారులో అదుపు తప్పి పంటపొలాలకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఆటోలో ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది. అతడికి గాయాలు కాగా.. స్థానికులు వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

అక్షింతలు పంపిణీ

ఖిల్లాఘనపురం: మండలంలోని అల్లమాయపల్లిలో బుధవారం శ్రీరాముల వారి అక్షింతలను ఇంటింటికీ పంచారు. సర్పంచ్ శేషయ్య, పెద్దలు భగవంతు, అశోక్ తదితరులు ప్రత్యేకంగా ఓ ట్రాక్టర్‌కు రాములోరి పాటలు ఏర్పాటు చేసుకుని గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. 22న అయోధ్యలో రాముల వారి విగ్రహ ప్రతిష్ఠ తరువాత ప్రతి ఇంటిలో కనీసం 5 దీపాలు వెలిగించాలని వివరించారు. పూజలు చేసుకుని అక్షింతలను కుటుంబ సభ్యులంతా తలపై చల్లుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీ



ఆత్మకూర్: పట్టణంలోని గాంధీచౌక్‌లో ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించి ఒకరిపై కేసు నమోదు చేశారు. అలాగే వాహనదారుల హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. 12 బైకులకు జరిమానాలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, తాగి డ్రైవింగ్ చేయరాదని వాహనదారులకు సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 5వ వార్డు ఇందిరా కాలనీకి చెందిన గంధం రాములు గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పంపిన రూ. 5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, ఆదిత్య, లతీఫ్, అస్లాం, సూరి ఉన్నారు.

బాధితులకు పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వడ్ల మాధవులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. అదేవిధంగా అడ్డాకుల మండలం ముత్యాలంపల్లికి చెందిన మురళీస్వామి తండ్రి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించారు.

వంట కార్మికుల వ్యథ

- మూడు నెలలుగా అందని మధ్యాహ్న భోజనం బిల్లులు
- కొండెక్కిన ధరలతో నిర్వహణ భారం
- అప్పుల ఊబిలో కార్మికులు



పాన్‌గల్ కస్తూర్బాలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మహిళలు

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్నారు. మూడు నెలలకు సంబంధించిన వంట సరకులు, గుడ్ల బిల్లులు ఇప్పటికీ అందలేదు. దీనికి తోడు ప్రస్తుతం కూరగాయల ధరలు పెరగడం, నిత్యావసరాల కొనుగోలు భారమవుతున్నాయని నిర్వాహకులు వాపోతున్నారు. చేతిలో డబ్బులు లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తక్కువ ధరలతో భోజన పథకం నిర్వహిస్తున్న కార్మికులకు ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న రాగి జావా, అల్పాహారం అమలుకు అదనంగా ఎలాంటి పారితోషకం ఇవ్వడం లేదు.

మండలంలో..

మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో 36 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలల్లో 4 వేలకు పైగా విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు మూడు నెలలకు సంబంధించి గుడ్లు బిల్లులు రూ.2.48 లక్షలు, భోజనం బిల్లులు రూ.10.03 లక్షలు కలిపి రూ.12.51లక్షలు, కార్మికుల వేతనాలు నెలకు రూ.మూడు వేల చొప్పున 71 మంది కార్మికులకు రూ.6.39 లక్షలు కలిపి మొత్తం రూ.18.90 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

తరగతుల వారీగా ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం చెల్లిస్తున్న ధర

తరగతి	రూ.లలో
1నుంచి 5వ తరగతి	5.45
6నుంచి 8వ తరగతి	8.17
9నుంచి 10వ తరగతి	10.67



పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో వంట చేస్తున్న మహిళలు

పెరిగిన ధరలు

కందిపప్పు కిలో రూ.160, పెసరపప్పు రూ.130, కిలో వంట నూనె రూ.120 కి చేరాయి. ఇక కూరగాయలు రకాన్ని బట్టి కిలో రూ.80 నుంచి 100 పలుకుతున్నాయి. ఇదిలా ఉంటే ప్రభుత్వం కట్టెలకు, గ్యాస్‌కు బిల్లులు చెల్లించడం లేదని వారు వాపోతున్నారు. మెనూలో భాగంగా విద్యార్థులకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో గుడ్డుతో భోజనం వడ్డించాలి. అందుకు గాను గుడ్డుకు రూ. 5 చొప్పున ప్రభుత్వం ఏజెన్సీలకు చెల్లిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర రూ. 7లకు పైనే పలుకుతోంది. దీంతో ఒక విద్యార్థికి రూ. 2 చొప్పున వారంలో రూ. 6 అదనపు భారం పడుతోందని కార్మికులు వాపోతున్నారు.

జాప్యం వద్దు



మధ్యాహ్న భోజన బిల్లులు రెగ్యూలర్‌గా అందకపోవడంతో అప్పుల పాలవుతున్నాం. ఒక వైపు కూరగాయలతో పాటు అన్ని సరకుల ధరలు పెరిగిపోయాయి. మూడు నెలల బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా కొత్త ధరలను అమలు చేయాలి.

– శివమ్మ, వంట కార్మికురాలు, పాన్‌గల్

ధర పెంచాలి



మధ్యాహ్న భోజన కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వారికి బిల్లులు పెంచాలి. ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం చెల్లిస్తున్న బిల్లులను పెంచుతూ నెల నెల కార్మికులకు చెల్లించాలి. అధికారులు స్పందించకపోతే కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

– కళావతమ్మ, సీపీఐ జిల్లా నాయకురాలు, కేతేపల్లి

ప్రభుత్వానికి నివేదించాం



మూడు నెలలకు సంబంధించిన బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. దీనికి సంబంధించి ప్రభుత్వానికి నివేదిక అందించాం. బిల్లులు మంజూరైతే వారి వారి ఖాతాలల్లో జమ చేస్తాం. బిల్లులు అందక కొన్ని పాఠశాలల్లో వంట చేసేందుకు కార్మికులు ముందుకు రావడంలేదు. దీంతో ఆయా గ్రామాలల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రత్యామ్నా మార్గాలు చూసి వంటలు చేయిస్తున్నాం.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్

వైద్య శిబిరం



పాన్‌గల్: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంతో పాటు కేతేపల్లిలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించినట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పెబ్బేరు రూరల్: వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లి, నాగరాల, వెంకటాపురం గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పలు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాముడు, పవన్, వినయ్, ఏఎస్ఎం భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



దళితుల అభ్యున్నతికి పోరాటం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనాపురం: దళితుల బతుకులను మెరుగుపరిచేందుకు కేవీపీఎస్ అనేక పోరాటాలు చేస్తుందని వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం అంబేడ్కర్ చౌరస్తాలో తహసీల్దార్ అబ్రహం లింకన్, ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి, మండల నాయకులతో కలిసి 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ చాలా గ్రామాల్లో దళితులు ఉండటానికి ఇల్లు లేదని వాపోయారు. అన్ని రకాలుగా వెనకబడిన దళితులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు వెంకట్‌నారాయణ, నాగన్న, రవీందర్‌రెడ్డి, వేమన్న, సత్యశీలారెడ్డి, వడ్డె కృష్ణ, వడ్డె రాములు, శంకర్‌యాదవ్, భూమా కృష్ణవర్ధన్, మహేష్ కుమార్, ఆవుల రాఘవేంద్ర, చెన్నయ్య, చిరంజీవి, మాసన్న, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు సోదరభావం పెంపొందిస్తాయి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడలు యువకుల మధ్య సోదరభావం పెంపొందించేందుకు దోహదపడుతాయని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలో గెలుపొందిన జట్లకు బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతి సాధించిన గ్రౌండ్ జట్టుకు రూ.6వేల నగదు, షీల్డ్, రెండో బహుమతి గెలుపొందిన బీసీకాలనీ జట్టుకు రూ.4 వేల నగదు, షీల్డ్ అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రికెట్ పోటీల నిర్వహణకు టీపీసీసీ గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ అభినందనీయం అన్నారు. యువకులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకుని గెలుపోటములను సమానంగా స్వీకరించి మరోమారు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, నాయకులు మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, విష్ణుయాదవ్, శ్యాం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టు విజేత వైఎస్‌ఆర్ కడప జట్టు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో జూపల్లి యువసేన ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ఓపెన్ టు ఆల్ వాలీబాల్ జట్టు విజేత వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టు విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వరకు కొనసాగిన ఫైనల్ పోరులో వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టు, హైదరాబాద్ జట్టు తలపడగా కడప జట్టు విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన జట్టుకు రూ.లక్ష నగదు, షీల్డ్, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50 వేలు నగదు, షీల్డు, తృతీయ స్థానంలో నిలిచిన మహబూబ్‌నగర్ జట్టుకు రూ.25 వేలు నగదు షీల్డు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ రవికుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందిస్తుందన్నారు.

బహుమతులు అందజేత

కోడేరు: మండల కేంద్రంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు, మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం అందజేశారు. పోటీల్లో 8 జతల ఎద్దులు పాల్గొనగా మొదటి బహుమతి నాగర్‌కర్నూల్ జిల్లా యాదిరెడ్డిపల్లికి చెందిన అఖిలేష్‌రెడ్డి ఎద్దులు 3250 ఫీట్లు లాగి ప్రథమ బహుమతి రూ.80వేల నగదు అందుకున్నారు. ద్వితీయ బహుమతి వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన గురునాథం ఎద్దులు 2968 ఫీట్లు లాగి రూ.60వేలు, తృతీయ బహుమతి కేటీదొడ్డికి చెందిన తిరుపతయ్య ఎద్దులు 2774 ఫీట్లు లాగి రూ.50వేలు, గద్వాలకు చెందిన వినస్‌రాయుడు ఎద్దులు 2431 ఫీట్లు లాగి రూ.40వేలు, కంచపాడుకు చెందిన సుధాకర్‌రెడ్డి ఎద్దులు రూ.30వేలు, పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణ ఎద్దులు రూ.20వేలు, దేవబండకు చెందిన భాస్కర్‌గౌడ్ ఎద్దులు రూ.15వేలు, రేమద్దులకు చెందిన పెద్ద బాలయ్య ఎద్దులు రూ.10వేలతో పాటు షీల్డును అందుకున్నారు. అనంతరం మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీంతో పాటు బహుమతులు ప్రదానం చేసిన రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సురేష్, రామకృష్ణను సన్మానించారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి సమీపంలో గల కొమ్ములగట్టు లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామం నుంచి స్వామి వారిని పల్లకీ సేవలో ఊరేగించారు. ఈ సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గ్రామస్తులతో కలిసి స్వామివారికి పట్టువస్త్రాలు అందించి పూజలు చేశారు. జంగమాయపల్లితో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈనెల 17 నుంచి 27వరకు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు, అభిషేకం, కల్యాణోత్సవం జరిపించారు. పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు రమేష్‌గౌడ్ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్, ఆలయ కమిటీ చైర్మన్ కొండల్, జిల్లా కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి గిరిజ, మాజీ వైస్ ఎంపీపీ ఉమ, నీలేందర్, సురేందర్‌గౌడ్, సుభాష్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, మల్లేష్, బాలరాజు, యాదగిరి చదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసేందుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బుధవారం ఉదయం 10గంటలకు కొత్తకోటకు రానున్నట్లు తహసీల్దార్ బాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని ప్రొఫెసర్ జయశంకర్ సమావేశ మందిరంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. జెడ్పీవైస్ చైర్మన్, ఎంపీపీ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: ఈనెల 20, 21వ తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ అశోక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా తేదీల్లో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువత నూతన ఓటరుగా పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. దీంతో పాటు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులను ఫాం 8 ఉపయోగించి సరిచేసుకోవచ్చని సూచించారు.

వేధిస్తున్న భర్తపై పోలీసులకు ఫిర్యాదు

అమరచింత: వివాహం జరిగినప్పటి నుంచి భర్త శ్రీనివాసులు వేధింపులకు గురిచేస్తున్నాడని భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు గృహ హింస కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. పట్టణానికి చెందిన మౌనికను హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులుతో 2021లో వివాహం జరిపించారు. వివాహం జరిగినప్పటి నుంచి ప్రతినిత్యం శ్రీనివాసులు మౌనికను వేధిస్తూ, అదనపు కట్నం కోసం హింసకు గురిచేస్తున్నడని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థినికి సన్మానం

కొల్లాపూర్ రూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో నిర్వహించిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ 7వ ఇంటర్ సొసైటీ లీగ్ స్పోర్ట్స్ కాంపిటేషన్‌లో పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని మధుప్రియ 800 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా బుధవారం గురుకుల పాఠశాలల సెక్రెటరీ నికోలస్, అడిషనల్ సెక్రెటరీ హన్మంతు నాయక్, స్పోర్ట్స్ అధికారి రామలక్ష్మణ్‌లు విద్యార్థినిని సన్మానించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి

కొల్లాపూర్: పట్టణంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో ఇరుముడి ధారణ కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి బీఎస్‌కే భాస్కర్ సమక్షంలో అయ్యప్ప మాలధారులు ఇరుముడిని స్వీకరించారు.

జ్యోతిబసుకు ఘన నివాళి

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా సీపీఎం కార్యాలయంలో బుధవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ జ్యోతిబసు 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పుట్టా ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ జబ్బార్ మాట్లాడుతూ జ్యోతిబసు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా 32 ఏళ్లు సేవలందించారని, ఈ ఘనత దేశ చరిత్రలోనే ఎవరికీ లేదన్నారు. ఆదర్శ కమ్యూనిస్టు నేతగా ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మండ్ల రాజు, కురుమయ్య, గంధం మదన్, నందిమల్ల రాములు, మహేష్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం.. జ్ఞాపకాలు పదిలం



పెద్దమందడిలో ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

కొత్తకోట రూరల్: 17ఏళ్ల వయస్సులో విడిపోయిన వారు 19ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకుని ఆనందోత్సవంలో మునిగితేలారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకొని సంబరపడ్డారు. 2004–2005లో పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చిన్నప్పుడు పాఠాలు చెప్పిన గురువులు వెంకటప్రసాద్, మద్దిలేటి, రాంచంద్రయ్య, నర్సమ్మ, ఇంది, ప్రకాష్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా కలికట్టుగా చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. 19ఏళ్ల తర్వాత అందరిని ఒకే చోట కలిసేందుకు కృషి చేసిన వారికి చిన్ననాటి స్నేహితులు కృతజ్ఞతలు తెలిపారు.



పెబ్బేరులో..

పెబ్బేరు రూరల్: పెబ్బేరు బాలుర ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పలువురు విద్యార్థులు బుధవారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ స్థాయిల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకోవడంతో పాటు హెచ్‌ఎం రఘునాథం, ఉపాధ్యాయులు మధు, రాధరాణి, మన్నెమ్మ, సుబ్బలక్ష్మి, శ్రీనివాస శర్మను సన్మానించారు. పాఠశాలకు సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు.

రైస్‌మిల్ కార్యవర్గం ఎన్నిక



రైస్‌మిల్ అసోసియేషన్ నూతన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

కొత్తకోట రూరల్: జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుంత మల్లేష్ ఆధ్వర్యంలో మండల రైస్‌మిల్ అసోసియేషన్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విశ్వనాథం వెంకటరమణ, జనరల్ సెక్రెటరీగా ఎద్దుల కవిందర్‌రెడ్డి, కోశాధికారిగా కొండ శివ, ఉపాధ్యక్షులుగా డి.నాగన్న, బి.రమణ, కార్యవర్గ సభ్యులుగా కొట్టం వంశీధర్‌రెడ్డి, భీమ భాస్కర్, బాలకృష్ణారెడ్డి, భీమ సంతోష్, రవితేజ, సంపత్‌రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కమిటీని సభ్యులు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అకారణంగా అధికారుల దాడులు, మిల్లుల సమస్యలను కలిసికట్టుగా చర్చించుకుని పరిష్కార దిశగా ఆలోచించాలని తీర్మాణం చేసినట్లు వారు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన మండల రైస్ మిల్లుల యజమానులకు విశ్వనాథం వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కేతేపల్లి సర్పంచ్ అనిత, ఎస్‌బీఐ మేనేజర్ పవన్‌కుమార్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై కళాజాతా బృందం అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు వలన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పొందాలని సూచించారు. ఆయా పథకాలపై ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు వివరించారు.